క్లుప్తంగా

20న సత్య హరిశ్చంద్ర ఉచిత నాటకం

నాగులుప్పలపాడు: అభ్యుదయవాది, విద్యావేత్త, అంబేద్కరిస్టు శిఖా సోమయ్య మాస్టారు 5వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీ రాత్రి 8 గంటలకు ఉప్పుగుండూరు గ్రామంలోని బాబు జగజ్జీవన్‌రామ్ కూడలి వద్ద ఉచితంగా సత్య హరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శిస్తారని కమిటీ నిర్వాహకులు తెలిపారు. పౌరాణిక నాటకాల ప్రియులు, ప్రజలు హాజరుకాగలరన్నారు.

పేదలకు బియ్యం, చీరలు పంపిణీ



పేదలకు బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

చీమకుర్తి: సేవా సంకల్ప ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం సంతనూతపాడులో వంద మంది పేదలకు బియ్యం బస్తాలు, చీరలు పంపిణీ చేశారు. రిటైర్డ్ ఎంపీడీఓ షేక్ బికారి వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె హసీనా బేగం ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బికారి సేవలను సేవాసంకల్ప ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వెంకట రమణ కొనియాడారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, నారాయణస్వామి, శిఖాకొల్లి శ్రీను, మల్లారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలపై విచారణ చేపట్టాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సుజన్

ఒంగోలు అర్బన్: వైద్యారోగ్య శాఖలో 2020 సంవత్సరంలో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు సుజన్‌మాదిగ గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మందా సుధాకర్, కన్నా, జయకుమార్, నారాయణ, గోపి తదితరులు ఉన్నారు.

సర్వేరెడ్డిపాలెంలో ఘనంగా సామాజిక దినోత్సవం



సర్వేరెడ్డిపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న భాగ్యలక్ష్మి

ఒంగోలు రూరల్: ఒంగోలు రూరల్ మండలంలోని సర్వేరెడ్డిపాలెంలో సామాజిక సమతా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాయల సిబ్బందికి, వలంటీర్లకు సమావేశం నిర్వహించి అంబేద్కర్ ఆశయాల గురించి వివరించారు.

ముగిసిన సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు

కందుకూరు రూరల్: కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో రాష్ట్ర తైక్వాండో వైస్ ప్రెసిడెంట్ మాస్టర్ ఎస్‌కే.అబ్దుల్ సలామ్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ తైక్వాండో బాల, బాలికల పోటీలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా స్థాయిలో జరిగిన పోటీలకు సుమారు 80 మంది క్రీడాకారుల పాల్గొన్నట్లు జిల్లా కార్యదర్శి పి.అఖిల్ తెలిపారు.

ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



కరవదిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



విజేత రాజుపాలెం జట్టుతో ఎంపీడీవో సుజాత, బాల చెన్నయ్య

ఒంగోలు రూరల్: క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసిక బలానికి దోహదపడతాయని ఒంగోలు ఎంపీడీఓ పి.అజిత పేర్కొన్నారు. గురువారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల ముగింపు కార్యక్రమం కరవదిలోని జెడ్పీ హైస్కూలు మైదానంలో నిర్వహించారు. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పోటీలు ఉత్కంఠగా సాగాయి. కార్యదర్శులు పి.శ్రీనివాస్, వేమా శ్రీలక్ష్మి పోటీలను పర్యవేక్షించారు. సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కరవది ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడా ఆణిముత్యాలను వెలికితీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, వలేటివారిపాలెం కార్యదర్శి రంగారెడ్డి, పీఈటీ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



కరవదిలో స్పోర్ట్స్ కిట్లు అందజేస్తున్న ఎంపీడీవో, ఎంపీటీసీ, సర్పంచ్

క్రికెట్ పోటీల్లో గుండాయపాలెంపై కరవది జట్టు విజయం సాధించింది. ఖోఖో కరవది–2పై గుండాయపాలెం జట్టు గెలుపొందింది. వాలీబాల్‌లో సర్వేరెడ్డిపాలెం–గుండాయపాలెం జట్లు తలపడగా సర్వేరెడ్డిపాలెం జట్టును విజయం వరించింది. లైట్ ఫెయిల్ కావడంతో కరవది–చింతాయగారిపాలెం జట్ల మధ్య కబడ్డీ మ్యాచ్‌ను శుక్రవారం నిర్వహించాలని నిర్ణయించారు.

కొత్తపట్నం మండలంలో..

కొత్తపట్నం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తపట్నంలో నిర్వహించిన కబడ్డీ మ్యాచ్‌లో పురుషుల విభాగంలో విన్నర్‌గా రాజుపాలెం జట్టు, మహిళ విభాగంలో కె.పల్లెపాలెం జట్టు విజయం సాధించాయి. వీరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో తలపడనున్నారు. విజేతలను ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, పీడీ సాయికిషోర్, పంచాయతీ కార్యదర్శి అల్లెయ్య అభినందించారు.

అంబేడ్కర్ చిత్రపటం ఆవిష్కరణ

కొత్తపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ సందర్భంగా సంఘీభావం తెలుపుతూ ఒంగోలు అంబేడ్కర్ భవనంలో గురువారం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నంలోని బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్ కోటేశ్వరరావు గీసిన వర్ణ చిత్రాన్ని కలెక్టర్ ఏస్ దినేష్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత ఆవిష్కరించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై ముద్రించిన 500 కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించి పంపిణీ చేశారు.



అంబేడ్కర్ చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న కోటేశ్వరరావు

ఘనంగా నాటకోత్సవం

ఒంగోలు మెట్రో: ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక సీవీఎస్ రీడింగ్ రూమ్ ఆవరణలో రెండు రోజుల నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ కంచర్ల రామయ్య నాటక పోటీలను ప్రారంభించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ రంగస్థల నటుడు సీహెచ్ రజితామూర్తి దంపతులను ఎన్టీఆర్ అవార్డుతో సత్కరించారు. చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నూదనగుంట వెంకటేశ్వర్లు, కళామిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ నూనెఅంకమ్మరావు, కె.బాలకోటయ్య పర్యవేక్షించారు.



నృత్య ప్రదర్శనలో బహుమతి పొందిన చిన్నారులు

పోలింగ్ కేంద్రాల వసతులపై అవగాహన

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వరకుమార్ ఎన్నికల సెక్టోరల్ ఆఫీసర్స్‌తో చర్చించారు. గురువారం చీమకుర్తిలోని మున్సిపల్ కార్యాలయం సమావేశం హాలులో నియోజకవర్గం నాలుగు మండలాల తహసీల్దార్లు, పోలీస్, ఇతర డిపార్టుమెంట్ అధికారులతో వరకుమార్ రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో గతంలో ఉన్న పూర్వ చరిత్ర, ఇతర వివాదాల సమాచారాన్ని సేకరించాలని వివరించారు.



ఎన్నికల సెక్టోరల్ ఆఫీసర్‌తో మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి వరకుమార్

జగనన్న ఆశీస్సులే శ్రీరామరక్ష



మాట్లాడుతున్న దర్శి ఇన్‌చార్జి డాక్టర్ శివప్రసాదరెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులే తమ కుటుంబానికి శ్రీరామరక్ష అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని ఉమామహేశ్వరపురంలో బీసీలు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో వారు బుధవారం రాత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలు మాట్లాడుతూ తమ కుటుంబంపై ఉన్న నమ్మకంతో దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా జగనన్న నియమించినందుకు వారికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. జగనన్న ఆశీస్సులు, ప్రజల ఆశీస్సులతో మరోసారి ప్రజలకు సేవచేసుకునే అవకాశం దక్కిందన్నారు. ఇరవై సంవత్సరాలుగా బూచేపల్లి కుటుంబం దర్శి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అండగా నిలిచిందని చెప్పారు. ప్రత్యేకంగా ఉమామహేశ్వరపురంతో తమ కుటుంబానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. సాగర్ జలాల కోసం నిత్యం రైతుల పక్షాన నిలబడి వారికి అండగా నిలిచామన్నారు. గతంలో ప్రతి ఎన్నికలోనూ ఐదు వందల మెజార్టీతో తమకు అండగా నిలిచిన గ్రామస్తులు ఈసారి 700 మెజార్టీ సాధించేందుకు కృషి చేయాలని అభిమానులను, కార్యకర్తలను, పార్టీ శ్రేయోభిలాషులను కోరారు. వైస్ ఎంపీపీలు వేముల పద్మాజానకిరామయ్య, బంకా రమణమ్మ నాగిరెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, సర్పంచ్ వేముల పద్మావతి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, సర్పంచ్‌ల సంఘ మండల మాజీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, నాయకులు మేకల వెంకటేశ్వరరెడ్డి, చింతల అంజిరెడ్డి, కోటిరెడ్డి, నాగూర్‌మీరావలి, ఇరుగుల కొండారెడ్డి, అబ్బిని అంజిరెడ్డి, యరబ్రోలు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుజ్జుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు జైభీమ్‌లు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చప్పిడి వెంగళరావు

ఒంగోలు: విజయవాడ నగరం నడిబొడ్డున నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళిత సంఘాల ఐక్యవేదిక తరఫున జైభీమ్‌లు ప్రకటిస్తున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక డ్రీమ్స్ స్కూలు సమీపంలో దళిత బహుజన మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఇది ఒక చారిత్రక ఘట్టమన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో దళిత బహుజనులు అందరు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దారా అంజయ్య, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, మాదిగ చైతన్య వేదిక కన్వీనర్ తేళ్ల దిలీప్, శ్రీను, మురళి, కృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, జిలకర పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



అల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న శాంతారావు, గ్రామస్తులు

అల్లూరు(కొత్తపట్నం): విజయవాడ స్వరాజ్ మైదానేలో శుక్రవారం 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలంతా సంఘీభావం తెలపాలని అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు కోరారు. గురువారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, వీఆర్వో సుబ్బారావు, సోమయ్య, అజయ్‌బాబు, రోశయ్య, కిరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణకు తరలిరండి

చీమకుర్తి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణకు పార్టీ శ్రేణులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ నాయకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. శుక్రవారం విజయవాడలో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అంకితం చేస్తున్న సందర్భంగా మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

ముగిసిన శిక్షణ తరగతులు

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులో బుధ, గురువారాల్లో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, శిక్షకులు పాల్గొని పలు అంశాలు కార్యదర్శులకు తెలియజేశారు. సచివాలయ పరిధిలో 15వ ఆర్థిక సంఘ నిధులు ఖర్చు చేసే విధానంపై వారికి అవగాహన కల్పించారు. జనరల్ ఫండ్ నుంచి నిధులు తీసుకునే విధానం, అదేవిధంగా వివిధ శాఖల పద్దుల నుంచి డబ్బు ఏవిధంగా తీసుకుని పనులు నిర్వహించాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. పనులు నిర్వహించే సమయంలో ప్రతి దశలోను ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం 9 రకాల థీమ్‌లను వివరించి వాటిలో పంచాయతీ పరిధిలో ఏదో ఒక థీమ్ మాత్రం తప్పని సరిగా తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని 2024–25 సంవత్సరానికి సంబంధించిన పనులు గ్రామ సభ ద్వారా తీర్మానం చేసుకోవాలని వారికి వివరించారు. పంచాయతీ పరిధిలో ఐదు కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కమిటీల పర్యవేక్షణలో పనులు చేయాలన్నారు. వారి వెంట గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

కొత్తపట్నం: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు పక్కాగా రూపొందించాలని ఎంపీడీఓ, శిక్షణ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాత ఆదేశించారు. గ్రామ స్థాయి అభివృద్ధి ప్రణాళిక తయారీపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామ సభలు, మహిళా గ్రామ సభలు, బాల గ్రామ సభలు, వార్డు గ్రామ సభలు తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం అంశాలను ప్రణాళికలో పొందుపర్చాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఎ.బాలచెన్నయ్య, ఏపీఎం రజీయా సుల్తాన్ బేగం, ఏపీఓ రత్నజ్యోత్స్న, నరేంద్ర దేవ్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ సుజాత

మద్యం బాటిళ్ల పట్టివేత

పీసీపల్లి: మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పూజల వెంకట నారాయణ కనిగిరి నుంచి మద్యాన్ని తెచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ అరెస్టు చేసి అతని వద్ద నుంచి 8 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు మోదు చేస్తున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఆరని చిచ్చు

● వేర్వేరుగా ఎన్టీఆర్ వర్ధంతి సభలు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న నెమిలయ్య వర్గీయులు..

కురిచేడు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. ఎంతోకాలంగా రెండు గ్రూపులుగా ఏర్పడి పార్టీ కార్యక్రమాలు చేస్తున్నా ఆ మంటలు చల్లారలేదు. తాజాగా ఎన్టీ రామారావు వర్ధంతి రోజు అవి ఇంకాస్త తారాస్థాయికి చేరాయి. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎన్టీ రామారావు విగ్రహానికి పార్టీ మండల కన్వీనర్ నెమిలయ్య, డాక్టర్ సునీల్, కాట్రాజు నాగరాజు, కిలారి కొండయ్య, కమతం నాగిరెడ్డి, మేరువ పెద్దిరెడ్డి, బొల్లేపల్లి ఆదినారాయణ, కేసనపల్లి సువయ్య మరి కొందరితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించి జిల్లా సరిహద్దులోని నరసాయపాలెం పోలేరమ్మ ఆలయం వద్ద పోటేళ్లతో విందు ఏర్పాటు చేశారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మొఘల్ మస్తాన్‌వలి, గడ్డం బాలయ్య, గంథ గుర్నాథరావు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, పావులూరి కోట్లింగయ్య, కేసనపల్లి మోషేలతో కలిసి అదే విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సినిమాహాలు సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద చికెన్‌తో విందు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు నారపుశెట్టి పాపారావు ఇరువర్గాల వద్దకు వచ్చి కార్యక్రమాల్లో పాల్గొని వెళ్లారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్‌ఆర్‌ఐ వస్తాడని, తమకు కాసుల వర్షం కురిపిస్తాడని, ఎవరికి వారు తమ బలబలాలను నిరూపించుకనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ విషయం అధిష్టానం వద్దకు చేరినా పట్టించుకోక పోవడంతో ఇరువర్గాలు రోజురోజుకూ ప్రతిష్టకుపోతున్నారు. ఇరువర్గాల పోరుతో కొందరు పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వారి అనుయాయుల ద్వారా పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ద్వితీయశ్రేణి నాయకుల మధ్య సయోధ్య కుదర్చలేని అధిష్టానం ప్రజలను ఏమి పట్టించుకుంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పార్టీకి దర్శి సీటుపై సేన నాయకులు, తెలుగు నాయకులు ఎటూ తేల్చుకోలేని అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

దొనకొండ టీడీపీలో అసమ్మతి సెగలు

దొనకొండ: మండలంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ అసంతృప్తి చాలా రోజుల నుంచి ఉన్నా గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారు పూలమాల వేసి నివాళులర్పించడంతో ఒక్కసారిగా బహిర్గతమైంది. గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదు. సీనియర్ నాయకులు షేక్ మగ్బుల్, మల్లికార్జునశర్మ, రమణాయాదవ్, సుభాని, మరి కొంతమంది విడిపోయారు. స్థానికంగా ఉండే నాయకుడు, టీడీపీ అధ్యక్షుడి నాయకత్వం సరిగా లేకపోవటంతో వర్గాలుగా చీలినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ప్రొసీడింగ్స్ ఉత్తర్వులు

ఒంగోలు: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ప్రొసీడింగ్ ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో వీఎస్ సుబ్బారావుకు ఏపీ టీచర్స్‌గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్తులతో సహా ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులు 56 మంది, ఆస్తులు కాకుండా ప్రభుత్వంలో విలీనమైన ఉపాధ్యాయులు 165 మంది ఉన్నారన్నారు. వీరందరికీ జీవో నంబర్ 50 ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారి పీఎఫ్ అకౌంట్, ఏపీజీఎల్‌ఐ కోసం జెడ్పీ సీఈవో ప్రొసీడింగ్స్ ఉత్తర్వులు జారీ చేసినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉదయభాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

హిందీ ప్రహార్ సభ పరీక్షల ఫీజు చెల్లించండి

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ప్రహార్ సభ ఆధ్వర్యంలో హిందీలో ప్రావీణ్యం పెంచుకునేందుకు పలు విభాగాల్లో పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి సునీల్ కన్న కోరారు. పరీక్షలు ఫిబ్రవరి 10, 11, 12 తేదీల్లో నిర్వహిస్తారని చెప్పారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నగరి బోధ్, ప్రవేశ్, ప్రథమ, మధ్యమ, ఉత్తమ పరీక్షలు, 11, 12 తరగతుల (ఇంటర్మీడియెట్) విద్యార్థులకు విశారద, భూషన్, విద్వాన్ పరీక్షలు జరుపుతున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఇండియన్ ఆర్మీ, హిందీ పండిట్ ఉద్యోగం పొందేందుకు అర్హులన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమ దరఖాస్తులను, పరీక్ష ఫీజును ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రహార్ సభ వారి చిరునామాకు పోస్టు ద్వారా ఈనెల 31లోపు పంపాలని కోరారు.